# బిందగిరి మోసాళ్ళు

**కొండమల్లి కోటేశ్వరమ్మ**

రావిచెట్టుక్రింద రిక్షా పెట్టుంది రావిచెట్టు మీద కోయల పాడుతుంది రావిచెట్టు ప్రక్కనున్న గుడిసెలో నుండి సత్తెమ్మ భైటకొస్తూ అగ్గికార్తె వచ్చినాదేటో? ఆకాశాన మబ్బు తునకగుపడనేదు రోయినీ కార్తె ఎండ కాత్తె రోళ్లగులుతాయని తాత సెప్పేవోడని, మా అమ్మ సెప్పింది ఎండకాసి నెత్తిమాడ్నా గాడీ తొక్కక నీకు తప్పదు రోడ్డు కాలి కాళ్ళుగల్తె బొబ్బ లెక్కేసినా పాసి పని సేయక నాకు తప్పదు గాడీలో తొంగుండిపోనావేటి? మావ! ఈ పొద్దుబాడు కెళ్లవేటి? అంటూ బర్తను లేపింది సత్తెమ్మ

ఏటేటో అంతున్నావు నాను బాడు కెళ్ల కుంటేనే బతికేడుతున్నావేటే? నీ యవ్వ సూరీడ్ని సూడంది నానోడ్ని సూడననీ ఏ ఒక్కడ్నీ గాడీ ఎక్కనీననీ నీ కెన్ని సుట్లో సొప్పాను ఇనుకున్నట్టు నేవు కోడి కూతకు నెగిసిపోతావ్ నన్ను లెమ్మంతావు పో పాసి పని సేయనుపో? అంటు కండ్లిప్పకనె కసురుకున్నాడు సింహాద్రి

పేదోళ్ల కోపం పెదవికి సేటంతారు పొద్దుటే సివాలేత్తావేటి? నా నెల్తున్నా! నంటూ బర్తకు చెప్పిన సత్తెమ్మ సుగుణమ్మింటి కొచ్చి భైట వాకిలూడ్చి నీళ్లు చల్లి బారెడు పెద్దెక్కిపోనాది భైటగుపడనేదు అమ్మగో రంటూ ముగ్గెట్టిన సత్తెమ్మ తలుపు కొట్టింది

వణకుతూ వచ్చిన సుగుణమ్మ తలుపు తీస్తూనే ప్రక్కనున్న పాల ప్యాకెట్లను చూసి అయ్యో! పాలు గెడపలోనె పడేరుస్తున్నాయి కుక్కలు గిట్రా నోట కరుసుకుపోలేదు నయమే నంటూ వాటిని తీసికెళ్లి ప్రిజ్‌లో పెట్టి సత్తులూ! గిన్నెలు నేనొచ్చి వెయ్యలేను అంట్లగిన్నెలతో వంటిల్లు ఆగమయ్యుంటుంది అన్ని కడిగి సర్ధమని చెప్పి కూర్చుంది

అంట్ల గిన్నెలు తీస్తున్న సత్తెమ్మ ఒక గిన్నెలోనున్న పాల ప్యాకెట్లనుచూసి- అమ్మగోరూ! పాల సంచులు గిన్నెలొ ఎట్టేసినా రంది

నిన్న 'నీవు రాలేదు నేను లేవలేదు కోడలు టి వి చూస్తూ **కూర్చుండిపోయింది** **కూతురింత** వండిపెట్టి ఊసులాడుతూ **వుండిపోయింది పాలు** కాయాలనే మాట మర్చిపోయారు **ప్రిజ్‌లో నైనా** పెట్టాలనే యోచన ఇద్దరికి **వచ్చుండ దంటూ** సుగుణమ్మ లేచెళ్లి పాలు గిన్నెలో కొంపి గ్యాస్ స్టౌవ్‌మీద పెట్టింది పాలు విరిగిపోయాయి వాటిని చూస్తూ బాద ఎడుతూ ఈ ఇంట్లో వున్నది ఉలవకట్టు పోయింది పెసరపాట్టు పెరుగు లేకుంటే అన్నం తినేది యెలాగని అందరూ అడిగేవారేను ఈ పూటపాలైనా లేచి కాచి తోడు పెట్టండర్రా! అని సుగుణమ్మ బిగ్గరగా అంది

చిన్న కొడుకు కండ్లిప్పి చూస్తూ ఎదవ సనుగుడు ఆదివారమ్మైనా మమ్మల్ని హాయిగా నిద్రపోనివ్వదు అంటూ కండ్లు మూసుకున్నాడు

పాలు కాస్తుంటే కండ్లు తిరిగిన సుగుణమ్మ కాళ్లీడ్చుకుంటూ హాల్లో కొచ్చింది హాల్లోని పంఖాలు తిరుగుతూనే వున్నవి లైట్లు వెలుగుతూనే వున్నవి తాగి పెట్టిన టీ కప్పులతో నీళ్ళులేని కాళీ సీసాలతో హాలంతా అశుభ్రంగ వుంది

హాలు చూస్తే వెర్రి కోపమొచ్చిన సుగుణమ్మ బాద్యతలేని బ్రతుకులక రాజకీయాలే సమస్తం ప్రెస్ క్లబ్ మీటింగులంటూ పచ్చజండాలు, పార్టీలంటూ ప్రక్క వాళ్ల నిద్ర పాడవుతుందనేది లేకుండా రెండింటివరకు ఉత్సాహంగా ఊసులాడారు నిద్రొస్తే ఎవరికి వారు లేచి వెళ్లి వారి వారి గదుల్లో పడుకున్నారు అయ్యయ్యో! తెల్లవార్లు ఎంత కరంటు వృదాగ కాలిపోయిందో? అంటూ సుగుణమ్మ వాటిని తీస్తుంటే కరంటు పోయింది

కోడలు రుసరుసలాడుతూ లేచి మైను తీశార ఏమిటి? ఫ్యాను ఆగిపోయింది కొంపలంటుకున్నట్లు ప్రొద్దున్నే లేచి అంగామ చేస్తారు తాను సుఖపడదు సరిగదా? మమ్మల్ని సుఖంగ బ్రతకనివ్వదంటూ మరల పడుకుంది

సత్తెమ్మ సగం గిన్నెలు కడిగి కులాయిలో నీళ్లు రావడం లేదని చెప్పింది సుగుణమ్మకు బి పి పెరిగింది రేపాదివారం కరంటు పోతుందేమోను నీళ్ల కిబ్బంది వస్తుంది మోటారు వేయమని ఒకసారికి నాలుగుసార్లు చెప్పాను నలుగుర్లో ఏ ఒక్కరు మోటరు సంగతి చూడలేదు విమర్శలు పొగడ్తల చర్చల్లోబడితే ముద్దికి, చదలు పట్టింది కూడా తెలియకుండా కూర్చుంటారు నీళ్ళు లేకుంటే నిముసం జరగదు మున్సిపాలిటీ పంపు కూడా పోతూంది త్వరగా నాలుగు బకెట్లు నీళ్లు పట్టవే తల్లీ! అంది సుగుణమ్మ

రెండు బకెట్లు నీళ్లు పట్టింది సత్తెమ్మ ఆ పంపు కూడా ఆగిపోయింది ఆ నీళ్లతోనే అంట్లు కడిగి ఇంటిని శుభ్రపరచిన సత్తెమ్మ ఒక్కరూ లేవనేదు కాఫీ గిట్రా ఎట్టుకుంటారో? ఏటో? బేగిలిపోయి రమ్మన్నాడు మావ అనుకుంటూ అమ్మా! నా పనైపోనా దంటూ సుగుణమ్మ దగ్గర కొచ్చింది

ఇల్లు నిశబ్దంగవుంది ఎవ్వరూ లేవనట్టుంది అనుకుంటూ సూర్యం హాల్లో కొచ్చి అలంకారు టాకీసులో మార్నింగుషో మంచిది వుంది మనమంతా వెడదామని రాత్రి అన్నారు నన్ను రమ్మన్నారు! అని స్పీకర్లో మాటలు వినిపించినట్లు మాట్లాడి అందర్నీ లేపేశాడు

గాలిలేక నిద్ర పట్టని సుగుణమ్మ సంతానం సూర్యం మాటలు వింటూ హాల్లో కొచ్చారు కోడలు వాష్‌బేషిన్ దగ్గరకెళ్లి అత్తయ్యగారూ! ఒక్క చుక్క నీళ్లు రావడం లే దంది

నీళ్ల కోసం కోడలు పడే ఆతురతను చూసిన కూతురు సత్తెమ్ముందిగా అమ్మ ప్రక్కింట్లో తెప్పిస్తుంది బెంగక్కర్లే దంది

ప్రక్కింట్లో వారు కూడా మీలాగే పట్టుకునుండ రనుకో ఎన్ని నీళ్లివ్వగలరూ కరంటొచ్చిన తరువాత స్నానాలు చేయెచ్చు బక్కెట్టే నీళ్లు తెస్తుంది అవసరాలు తీర్చుకుని కాఫీ తాగి వెళ్లండంది సుగుణమ్మ

కొడుకు లిద్దరూ కాఫీ పెట్టమ్మా! అన్నట్లు ఆమె వైపు చూశారు లేని వోపిక తెచ్చుకున్న ఆమె వణుకుతున్న చేతులతో కాఫీ కలిపిచ్చింది

కాఫీ తాగుతున్న కూతురు చెమట బాగా పట్టేసింది స్నానం చేయకుండా ఎలాగమ్మా! అంది అవునుగదా? స్నానం చేయకుండా సినిమా కెలా వెళ్లాలీ! అంది కోడలు మామ్మ అడగాలే గాని నీళ్లకేం కరువన్నాడు సూర్యం అరబకెట్టే కాదికి చేస్తాం నీళ్లు తెప్పించమన్నారు కొడుకులు

సత్తులూ! చస్తున్నా మనకు పని తప్పదే వోవరు ట్యాంకున్న సీతమ్మింటికెళ్లి నే నిమ్మన్నానని చెప్పి నీళ్లు తేవే అంది సుగుణమ్మ

* * * * * * * * *

బిందెతొ నీళ్లు మోస్తున్న సత్తెమ్మను కిళ్లీ బడ్డీలో కూర్చుని సిగిరెట్ తాగుతున్న రాములు చూస్తూ కడవెత్తు కొచ్చింది కన్నెపిల్లా అది కనబడితే చాలునా గుండె గుల్లా! పాట మొదలెట్టాడు పండ్లికిలించాడు

సత్తెమ్మకు భుజంమీద బిందె బరువెక్కింది

పంటలు పోనాయి పత్తుండలేం ఇజీనగర మెల్లి ఇంత పని చేసుకు బతుకుదామని నానంటే ఆడు నా మాటిన్లేదు సరిగదా? ఇజియివాడెలి పోదాం అక్కడగల్తె రిక్షా బాడుగ బాగుంత దన్నాడు ఆడోళ్లని అంట్లు తోమే పనికి అందరూ ఎట్టుకుంటారన్నాడు నన్నెంటెట్టుకొచ్చాడు

చీ చీ ఎదవసంతా! ఎరగని మనిసిని సూత్తే ఇక్కడోళ్ళు ఏటేటో వాగుతారు ఎదవ పాటలు పాడేత్తారంటూ రోడ్డు దాటి సుగుణమ్మింట్లో కొచ్చి బిందిలో నీళ్లు బక్కెట్లో వొంపేసి కాళీ బిందె పట్టుకుని బయం బయంగ రోడెక్కిన సత్తెమ్మ సీతమ్మింట్లో నీళ్లు పడుతుంటే సీతమ్మ కూతురు సత్తెమ్మని చూస్తూ మీది తూర్పా? కొత్తగ ఈ వూరొచ్చినట్లున్నావు ఎన్ని బిందెలు నీళ్లు పట్టుకెడతావు? అంది ఈ బిందే, మర్రెండొట్లు కెడతా నన్న సత్తెమ్మ బిందె నిండగానే బుజానెత్తుకుని రోడ్డెక్కింది

నిండు బిందెత్తుకు నడుస్తున్న సత్తెమ్మను

సైకిల్‌మీదొస్తున్న కుర్రాడు చూస్తూ కన్ను కొడుతూ రోడ్డుకు ఒక ప్రక్క నడువు సైకిల్‌ను ఆపమన్నట్లు ఏమిటా నడక? వంకరి టింకరి నడకలు నీ వయ్యారానికి మెరుగులు! ఏపిల్లో! గీజర బాజరగున్నావు? పాట మొదలెట్టాడు


సత్తెమ్మ కాళ్ళు తడబడ్డాయి భుజంపై బిందె మోయలేనంత బరువుగ తోచింది ఎదవ సచ్చినోళ్ళు ఆడదాయి కనిపిస్తే శాన ఆలిసిప్పలంత లేసి కళ్ళు సేసుకు సూత్తారు ఎరక్కపోయి బత్తి కొచ్చేసినాను! అనుకుంటూ ఇంట్లో కొచ్చి బిందెను బాత్‌రూములో దింపి హాల్లో కొచ్చి నీళ్ళు తేడం సరిపుచ్చుతా నంది

రెండు బిందెలకే అలసినట్లు మాట్లాడు తున్నావు అది చిన్న బిందె ఆ నీళ్ళు నలుగురికెలా సరిపోతాయి? అంది కూతురు

ఓవరు ట్యాంకులు పంపుసెట్లు డ్రైనేజీ వచ్చిన తరువాత పనివాళ్ళకు బద్ధకా లేర్పడినాయి అవి రాకముందు ఇంటికి సరిపోను నీళ్ళు ఎంత ప్రొద్దెక్కినా బావినుండి తోడిపోసేవారట సుఖం మరిగిన ప్రాణం కష్టాని కొప్పుకోదు ఇంట్లో ఇబ్బంది సబ్బంది కూడా చూడదు ఫైగ ఫస్టు తారీకు రాగానే పనివాళ్ళంతా జీతాలిమ్మని దేవిరిస్తూ అడుగు తారంది! కోడలు

సత్తులూ! రెండెలాగు తెచ్చావు మరి రెండు తెచ్చి వెళ్ళమ్మా చెప్పలేక చెప్పింది సుగుణమ్మ తప్పదా? అన్నట్లు చూస్తూ బిందెలో నీళ్ళు బకెట్లో పోసి కాళీ బిందెతో కదిలింది సత్తెమ్మ

రోడ్డుపై కార్లు బస్సులూ పరుగులు తీస్తున్నాయి రిక్షాలు, పాల సైకిళ్ళు, పండ్ల గంపలు మోసేవాళ్ళు బస్సు కోసం నడిచే ప్రయాణీకులు నడుస్తుంటే రద్దీ పెరుగుతున్నట్లుంది ఒక వైపు నుండి రెండవ వైపుకు రోడ్డు దాటాలంటే ప్రమాదంగ కనుపిస్తుంది



ట్రాఫిక్ పోలీసు బక్కచిక్కిన రిక్షావాళ్ళ నాపి, బలిసున్నవార్ని కార్లతో పోనిస్తున్నాడు నిండు బిందెతో వస్తున్న సత్తెమ్మను పోలీసు చూసి ఎండాకాలం నీళ్ళకు గిరాకి పెరిగింది బిందెకు ఏమాత్రం సంపాదిస్తున్నావేమిటి? బిందెలు బిందెలు నీళ్ళు మోస్తున్నావు గోసెట్టావు మట్టిగుడిసెలాగున్నావు మాకు మామూలిచ్చి నీళ్ళు జారబొయ్యాల్సి వుంటుంది తెలుసా? అంటూ విజిలేశాడు సత్తెమ్మ బిందెను మోస్తున్నట్లుగాక ఏనుగును మోస్తున్నట్లు బాదపడుతుంది రిక్షాల క్యూలో సింహాద్రి కనుపిస్తే బాగుండునని చూస్తుంది

క్యూ ముందున్న రిక్షాలో గోడకు నిలబెట్టిన మినుమలబస్తాలాగ బొరువుగ కూర్చున్నాడు ఒక వ్యాపారస్తుడు రిక్షా కూలీ కాళ్ళు తేలిపోతుంటే రిక్షాని లాక్కుపోతున్నాడు ఆ రిక్షా వెనుక రిక్షావాళ్ళు తొక్కమని తొందర చేస్తూ బెల్ మోగిస్తున్నారు అంతా చూస్తున్న సత్తెమ్మ తన బర్త కూడా ఇలాంటి బరువును లాగు తున్నాడా ?'

ఆడోళ్ళను వేధించుకు తినే రగిడీసును బండెక్కించుకొని బాధ పడుతున్నాడ? పరుల. కష్టంతో బ్రతుకీడ్చే బద్ధకస్తులెక్కినా రిక్షాను బుద్ధిగానే తొక్కుతున్నాడ? బండెక్కి బాదుగీయని పోలీసోళ్ళకు భయంపడి రిక్షాతో సమంగ బ్రతుకీడుస్తున్నాడ? ఇందుకేనా ఇక్కడ కొచ్చింది? అనుకుంటూ పోలీసును, రిక్షాను మార్చి, మార్చి చూస్తూ రోడ్డు దాటను నడుస్తుంది

చెమటలు పట్టిన రిక్షావాడు తప్పుకోమని బెల్ మ్రోగించబోయి చేతులు పట్టు తప్పి హాండిల్సు వదిలేసి తూలి నేలపై బడ్డాడు బండి తల్లక్రిందు లౌతూ సత్తెమ్మను గుద్దింది సత్తెమ్మ కూలబడింది బిందె రోడ్డుపైబడి పగిలిపోయింది

రిక్షావాడు తెలివి తప్పాడు రిక్షా దెబ్బ తింది రిక్షాలోని మినుముల బస్తాలాంటి మనిషికి కారే రక్తాన్ని చూసిన పోలీసు మరొక రిక్షాను పిలచి ఆ మనిషి నెక్కించి రిక్షాను హాస్పటల్‌కు పోని మ్మన్నాడు

పోలీసు స్పృహ తప్పిన రిక్షావాణ్ణి చూస్తూ ఎదవనాయాల సుక్కేసుకొచ్చుంటాడు చూస్తూనే బాలెన్సు తప్పాడు బొక్కలో తోస్తామని తెలివి తప్పినట్లు నాటకమాడుతున్నాడు అన్నాడు

సత్తెమ్మ తనకు తగిలిన దెబ్బను చూసుకొన కుండా పడిపోయిన బిందెను చూస్తూ ఓలమ్మో! బిందె పగిలిపోనాదంటూ గుండెను బాదుకుంటూ అమ్మగోరి కోడలు వళ్ళు తెలియని వొయ్యారంగ నడిచి బిందె పగలేసి నావని తిట్టేస్తది అమ్మగోరి కూతురుగలేత కొత్త బిందె కొనియ్యమంతది లేకుంటే బిందె బాకీ తీరుమాన మయ్యేంతవరకు జీతం అదక్క, నాగాలు ఎట్టక, పని సేయమంతది అమ్మగారి కొడుకులుగలేత నా మావతొ సెప్పి నన్ను కొట్టమంటా రంటూ ఎక్కెక్కి సడుతూ నా నేటి సేతును దేవుడా? అంటూ పగిలిన బిందెను పట్టుకున్న సత్తెమ్మ

రోయినీ కార్తె ఎంద కాసి రోళ్ళగిలినా అగలకున్నా రోడ్డుమీద అన్యాయం చూసి సూరీడు అగ్గైపోనాడు భూవి బుగ్గైపోనాది నాబింది పగిలిపోనాదంటూ ఏడస్తూ రోడ్డు దాటి నడుస్తుంది □